# ఆధునిక నాటకములు

నెల్లూరు నాగరాజరావు గారు

ఆధునిక నాటకములగూర్చి వ్రాయుట మిక్కిలి జవాబుదారికార్యముగను, కఠినమైన కర్తవ్యముగను వున్నది. అందునను ప్రకృతము రంగస్థలమున ప్రదర్శింపబడువాటి గుణదోషముల జెప్పదొడగిన అనేకుల ప్రహారవాక్కులకును, తుచ్ఛవిమర్శనలకును గురి కావలసి వచ్చును. గుణకథనమువల్ల స్తోత్రప్రియముచేత, సామాన్యజనులందు సంతోషమే జనించును. దోషములచెప్ప దొడగిన కోపము, తిరస్కారము, అవహేళనము, కలుగును. ఇది లోకాచారము. చేదుమందు నొసంగువైద్యుడు రోగికి శత్రువు కాడు. ఈన్యాయము ప్రకృత సందర్భమున కన్వయింతము. నాటకకళ లోకశిక్షణమునకు ఉత్తమసాధనము. "The stage not only refines the manners, but it is the best teacher of morals, for it is the truest and most intelligible picture of life" నాటకకళయం దట్టిమహత్త్వ మున్నదనిన వాటిదోషముల నుపేక్ష చేయుట మేలుగాదు. దోషములను చర్చచేసి బహిరంగపరచునతడు పైజెప్పిన న్యాయము ననుసరించి కళయొక్క అభివృద్ధికోరునతడే గాని ద్వేషి కానేరడు. ఆధునిక నాటకములలోనున్న యవగుణములను విమర్శించునది, పరిహరించునది, ఖండించునది సామాన్యమయినకార్యము గాదు. బహుకష్టతరమైన విషయము. అయిన ఆనాటకము, ఈ నాటకము అని నిర్దేశింపక నాటక రచనగూర్చి మాత్రమే నిరూపింతును. అప్పుడు కొన్నిటిని ఉదాహరణార్థము గైకొనక తప్పదు. నాటకము జీవితముయొక్క చిత్రమైయున్నందున దానిరచనయందు స్వభావపరిపోషణము ముఖ్యమగుచున్నది. దానిని ఉపపాదించుటకు పూర్వము, దానియొక్క ప్రారంభమునుగూర్చి రెండుముఖ్యవాక్యములు వ్రాయుట యుత్తమము. నిజమయినయాకర్షణ నాటకముయొక్క ఆరంభమునందే యుండవలెను. రూపకములన్నియు ఒకవిశిష్టప్రసంగముయొక్క ప్రతిబింబములు. ఆప్రసంగము లెక్కడనుంచి ప్రారంభమగునో అక్కడనుంచి దానినుపక్రమించుట మేలు. సీతాస్వయంవరమునుగూర్చి నాటకము రచించునప్పుడు స్వయంవరసంకల్ప మెక్కడనుండి పుట్టినదో అక్కడనుంచి రచన ప్రారంభించుట మంచిది. అట్లుగాక కథానాయకునియొక్కగాని నాయికయొక్కగాని పూర్వచరిత్రపరిచయ మవశ్యము కాదు. ఏసందర్భము వర్ణనీయమైనదో అచ్చటినుంచి అనగా మధ్యనుంచి ప్రారంభించుట యెక్కువ ఆకర్షకముగ నుండు కాదంబరిలోని కథలను అట్లే యున్నవి. ఉదాహరణముగ శాకుంతల నాటకమును గైకొందము: తపోవనమందలి లేళ్లను తరుముచు ఋష్యాశ్రమమునకు వచ్చునట్లు దుష్యంతుని మహాకవి కాళిదాసు ప్రవేశపెట్టెనుగాని 'శకుంతలయనునొకయువతియుండెను. ఆమె విశ్వామిత్రఋషికి మేనకవల్ల జన్మించెను. శకుంతల పక్షులవల్ల కాపాడబడెను, కణ్వమహామునికి నదీతీరమున ఆమె చిక్కెను' అని కానీ, 'హస్తినాపురమును దుష్యంతుడనురాజు పరిపాలించుచుండెను. అతడు శూరుడు; ధర్మిష్ఠుడు. ఒకనాడు వేటకువెడలెను' అని మొదలిడలేదు. మరొకయుదాహరణము. వేణీసంహారమున భీమ సహదేవ సంవాదముతోనే నాటకము ప్రారంభింపబడినది కాని "హస్తినావతియందుపాండవులు కౌరవకుమారులుండిరి. వారిలో జూదమాడుట ప్రారంభమయ్యెను. పాండవులు ఓడిపోయిరి. రాజ్యములు పోయెను. వనవాసము ప్రాప్తమాయెను. అజ్ఞాతవాసమయినపిదప కౌరవులతో యుద్ధము తటస్థించెను." అను నిత్యాదిపాండవుల ఇతిహాసమంతయు వ్రాయక నాటకము మధ్యనుండియే రచింపబడియున్నది. పాశ్చాత్యనాటకములలోను ఇట్లే మధ్య

నుంచి వ్రాయుపద్ధతి కానవచ్చుచున్నది. కర్ణాటకములో సంవిధానము గమనించినట్లు లేదు. శ్రీకృష్ణజననమను నాటకమును ప్రారంభించుటకు తొలుత కంసుడు, శిశుపాలుడు, దంతవక్త్రుడు మొదలగు రాక్షసులబాధ కోర్వక, భూదేవి, శేషశయనుడైన మహావిష్ణువును బ్రార్థించునట్లును, మహావిష్ణువు తాను భూలోకమునవతారమెత్తి వారిని సంహరింతునని తెల్పుటయు మొదలగునవి చిత్రించెదరు. ప్రహ్లాదనాటకమందును, యిట్లే శ్రీమన్నారాయణుని సందర్శనార్థమై సనత్కుమారాది ఋషుల ఆగమనము, ద్వారపాలకులైన జయవిజయుల ప్రతిబంధకము, వారిని ఋషులు శపించుట, విష్ణుమూర్తియొద్ద జయవిజయుల ప్రార్థన, శాపవిమోచన, మొదలగునవి ప్రదర్శింతురు. హరిశ్చంద్రలోను ఇట్లే ఇంద్రసభలో వసిష్ఠ విశ్వామిత్రుల వాగ్వాదము, హరిశ్చంద్రుని శీలము పరీక్షింప ప్రతిజ్ఞ మొదలైనవి. ఇట్లే పెక్కుఉదాహరణములం జూపవచ్చును. వీటివల్ల ఏయుపయోగమును కలుగుట లేదు. నాటకప్రారంభమందే, కార్యమునందు వ్యక్తులైనట్టిపాత్రల రంగముపై ప్రవేశపెట్టుట కాళిదాసుని మతముగ కానవచ్చుచున్నది. కాని పైజెప్పినవి, హరికథలకు భాగవతములకు ఉపయోగింపవచ్చును. నాటకములందు విషయ మెక్కడ ఆరంభమగునో అక్కడనుంచి మొదలిడుట యుత్తమపద్ధతిగా నున్నది. నాటకముయొక్క ఉత్కృష్టత దాని ప్రారంభమును బట్టి యుండుననుట యెట్లో అట్లే స్వభావపరిపోషణమునుబట్టి యుత్తమత్వము నిరూపింపవచ్చును. ఇతిహాసము, చరిత్ర, వీటికంటె నాటకమునకు దానియందలి స్వభావపరిపోషణమువల్లనే ఉత్తమస్థానము లభించుచున్నది. నాటకరచనయందు మిక్కిలి చమత్కారమయిన సంవిధానము రసభరితమయిన వర్ణన, గద్యపద్యముల రచనాచాతుర్యము, సుందరమైన భాషాపద్ధతి, యివియెల్లగలిగి స్వభావపరిపోషణ లేకపోయిన ఉప్పులేనివంటవలె నిరర్థకమగును. ప్రయోగమునకు వ్యర్థమగును. ప్రశస్తముగా నలంకరింపబడిన రంగభూమి ఉత్తమమైన యవనికలు, మనోహరములైన వస్త్రాలంకారములు, గానము, నర్తన, అభినయము ఇవియెల్ల సమృద్ధిగానుండి పాత్రలయందు స్వభావపరిపోషణ లేకపోయిన విద్యాధికప్రేక్షకులచే నది నిరసింపబడును. పాశ్చాత్యనాటకములం దేదికొఱతపడినను స్వభావపరిపోషణమునకు ప్రాధాన్యమొసగబడుచున్నవి. షేక్స్పియర్ యొక్క ముఖ్యనాటకములలో నేదైన ఒకటిరెండు నాటకముల జదివిచూచిన స్వభావపరిపోషణమునుగూర్చి చేసినప్రశంస యసత్యముకాదని తెలియవచ్చును. స్వభావపరిపోషణము పాశ్చాత్యనాటకములలో నున్నదిగాని మననాటకములలో లేవనికొందఱు తలంచుచున్నారు అది దురభిమానము. వనశాకుంతల, ఉత్తరరామచరిత్ర, వేణీసంహారము మొదలగు కొన్ని సుప్రసిద్ధనాటకములందలి ఆయా ముఖ్యపాత్రలయొక్క స్వభావము ఎట్లు పరిపోషింపబడినదియు కొంతవఱకైనను వ్రాయుట 'ముఖ్యమగుచున్నది. ఉదాహరణములను తెల్పుటకు ముందు పాఠకులకు స్వభావపరిపోషణయొక్క స్వరూపమును తెల్పుట యుక్తము. ముఖ్యపాత్రలయొక్క స్వభావము, వారివిచారము, ఆచారము, ఇత్యాదులు చక్కగా పరిపుష్టిచెందవలెను. నాయకుడు, నాయిక, ప్రతినాయకుడు, వారివారియనుచరులు యీయెల్లర స్వభావములను, నడకలచేత, మాటలచేత, చూపులవల్లను వ్యక్తమగునట్లు చూపింపవలెను. శృంగారరసమునకు రతి స్థాయిభావము. నాయకుడు వాని యెల్లవ్యాపారములందు శృంగారభావము వ్యక్తముచేయవలెను. ముఖ్యాముఖ్యములైన యేసాధనములు గలవో వాటివల్ల నీభావము పరిపుష్టిచెందవలెను. ప్రీతికరమయిన వస్తుప్రాప్తి కలిగినప్పుడు నాయకుడు యెల్లయుపాయముల గైకొనును. వాని యుద్దేశ్యము కొంతవఱకు సాధింపబడినదని తోచిన ఆతనికి సంతోషము పుట్టును. తనయుద్దేశ్యసిద్ధికి వ్యాఘాతము గలిగిన విచారపడును. అప్పు డతని ఆలోచనలు సంభాషణలు, వీటియందు ఉద్దేశ్య సిద్ధిపరమయిన భావములు కనబడునట్లుండవలెను. నాటకగ్రంథకర్త నాయకునిస్వభావమును సర్వాత్మనా పరిపోషింపవలెను. వీరరసమందు నాయకుడు ఉత్సాహభరితుడై యుండును. ఉత్సాహమే దీనికి స్థాయిభావము. వీరుడైన నాయకుని మాటలందు, కార్యములందు, చింతయందు, స్మరణయందు ఉత్సాహముతప్ప మరి యేయితరకార్యము లుండరాదు. వానినోటవచ్చు మాటలందు శృంగారపరమైనవిగాని, హాస్యభరితములైనవిగాని, అథవా దౌర్బల్యసూచకములైనవిగాని యున్నచో వీరరసము ప్రతిఫలిం

పడు. పైగా రసాభాసమగును. ఇట్టిరసాభాసము పట్ల స్వభావపరిపోషణము కుదురదు.

నాటకమందలి అవాంతరవిషయములు సహితము స్వభావపరిపోషణకు దోహదములు కావలెను. మహానదులను ఉపనదులుచేరి యెట్లు పెద్దప్రవాహముగ జేయునో అట్లు నాటకాశ్రయమగు ముఖ్యరసమునకు ఇతర అవాంతరములు చేరి పరిపుష్టి చెందునట్లు చేయుటయే స్వభావపరిపోషణము. దీనియొక్క స్వతంత్రలక్షణము చెప్పుట కష్టమే, అయినను యేరసమునుగాని, గుణమునుగాని, ప్రధానముగ నిరూపింపదలచియుండునో అట్టికవి ఆ యారసమును, గుణమును, స్పష్టముగా చూపించినను రసముయొక్క స్వాభావికమయిన మర్యాద నుల్లంఘింపక, అతిశయోక్తికి వెళ్లక శిష్టాచారము నతిక్రమింపక, సంవిధానమును కూర్చుట, పాత్రముల చిత్రించుట, ప్రధాననాయకుని నేర్పరుచుకొనుట, మొదలగునవి స్వభావపరిపోషణముయొక్క ముఖ్యలక్షణములు.

భరతఖండమందలి ప్రాచీననాటకములందు స్వభావపరిపోషణ కనుబడుట లేదని కొందఱిమతమైయున్నది. దానిని ఖండించుటకు కొన్ని యుదాహరణముల జూపవచ్చును. మననాటకములందు ముఖ్యముగ శాకుంతలము, ఉత్తరరామచరిత్ర, వేణీసంహారము ఇత్యాదులందలి కొన్ని భూమికల గైకొని స్వభావ పరిపోషణ దృష్టితో నెట్లు చిత్రింపబడినదియు నిరూపించెద. శాకుంతలమందలి దుష్యంతభూమికను ప్రథమమున చూతము. శకుంతలతొలుత దుష్యంతునిదృష్టికి పడినదిమొదలతడు మోహమూఢుడై పోయినట్లు కనబడుచున్నాడు. ఇంతపెద్దరాజుగానుండి శకుంతలయొక్క మోహమునకు బద్ధుడై చిక్కువడి ఆశ్రమమందలి చెట్లచాటునుండి పూపొదల వెనుకనుండి ఆమెమాటలను, చేష్టలను, నడకలను చూచి యానందించుచుండును. తనమిత్రునితో ఆమెప్రస్తావన తప్ప వేరుమాటలు ముచ్చటింపడు. ఆమెపై విరహముచే తనదర్శనము యితరులకు నీయడాయెను. నిజరాజధానినుండి తల్లి రమ్మని కబురంపినను, తపోవన రక్షణమిషచే తానువెళ్లక తనమిత్రుని రాజనగరునకుబంపెను. శకుంతల కూర్చున్న స్థలములను, పండుకొన్న చోట్లను, నడచినమార్గమును, సందర్శించుచు, తనవిరహమును బాపుకొనుచుండెను. చూడవఅంకమందు, శకుంతల, సఖులు, రాజు, వీరిసంభాషణవల్లను, ఆరవఅంకమందు ఆమెయందలి విరహముచే పీడింపబడినవాడై యుండినందున దుఃఖితుడై వసంతోత్సవమునుసహా నిలుపుదల చేయించెను. ఇతనిచర్యలబట్టి శృంగార నాయకుడు యెన్నివిధములు విరహముతో తపించునో యనునది తెల్లమగుచున్నది. శకుంతలయందలి మోహముచే నొకవిధముగ వెఱ్ఱివానివలెనున్నను తనయొక్క ధీరోదాత్త స్వభావమును మఱచినవాడు కాడు. స్వతః మహారాజుగా నున్నందున ఇతనికి ఏవిషయము అవశ్యములేదు. ఇట్లుండియు శకుంతల అవివాహితురాలు; క్షత్రియకన్యక అనునీరెండు సంగతులు దెలియువఱకు తనప్రేమను బిగబట్టుకొని యుండెను. మరల శకుంతల తన నగరునకు వచ్చి తన్నుస్వీకరింపుమని కోరునప్పుడును ఆమె పూర్వపరిచయము శాపకారణముచే మఱచియు పరస్త్రీ నెట్లు స్వీకరింతునాయని యెంచి యామెను నిరాకరించి తనపాపభీరుతను కనబఱచెను. మహాకవి కాళిదాసు శృంగారరసమును ఉత్కృష్టముగాజూపునప్పుడే సామాజికనీతిని సహాన్వక్తీకరించెను. దుష్యంతునియందు ఎట్లుపాపభీతియున్నదని తెల్పితిమో అట్లే శకుంతలయొక్క కులీనస్వభావము వ్యక్తమగునట్లు కానవచ్చును. దుష్యంతునియందు సంపూర్ణానురాగమున్నను "పెద్దలయనుమతి లేనిదే నే నెట్లు స్వతంత్రించి యీకార్యమున కియ్యకొందు"ననుమర్యాదవాక్యము అడిగెను. శాకుంతల నాటకమందు ఏశృంగారరసము కలదో దానిని మహాకవి కాళిదాసు ఉత్తమరీతిచే స్వభావపరిపోషణతో నిమిడ్చియున్నా డనుటకు ఏయభ్యంతరము లేదు.

ఉత్తరరామచరిత్రయందు కరుణరసము చక్కగా పోషింప బడియున్నదని పాశ్చాత్యులే నిర్వివాదముగ నొప్పుకొని యున్నారు. శ్రీరాముడు సీతను లంకయందు పరిగ్రహించునప్పుడు మానుష్యామానుష్యములైన యెల్ల ఉపాయములచేత సీతయొక్కశీలమును వెల్లడించెను. సీత రావణునియొద్దనున్నను నిర్దోషురాలని రామునకు స్వతః తెలిసియున్నను, అగ్నిప్రవేశము అను అలౌకిక సాధనముచే ఆమెయొక్క పవిత్రతను లోకమునకు దెల్పుటకిట్లొనర్చెను. జనులయొక్క మాటలకు చెవి నీయవలసిన యావశ్యకమును లేదు. ఇట్లుండునపు డెవడో యొక చాకలివానిమాటలు విని సీతను అరణ్యమునకు బంపెను.

ఏప్రియమైన సీతను లంకనుండి తెచ్చుటకు రాముడు అసాధ్యమైన సహాయమును గైకొని యుద్ధముకూడ నొనర్చెనో అట్టిప్రాణాధికురాలైన సీతను వదలుట,కరుణ రసముయొక్క ప్రభావము కాదే? తనప్రజలయందు గొప్పవానినిగాని, క్షుద్రునిగాని, మరెవరినైనగాని, ఆరాధించుట రాజుయొక్క కర్తవ్యముగదా? ఈలోకారాధనముకొఱకు రాజు దేనినిగాని త్యజించుటకు సంసిద్ధుడై యుండవలెననునదియే శ్రీరామునిమతమై యున్నది.

"స్నేహం దయాంచ సౌఖ్యంచ యదివాజానకీమపి;
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా."

అనగా 'లోకారాధనముకొఱకు స్నేహమునైనను దయనైనను, సుఖమునైనను, లేదా, ప్రత్యక్షజానకినైనను వదలుటకు నాకేవ్యధయులేదు' అనెను. అత్యంతప్రీతికరమైనదానిని, కల్పనాతీతమైన కష్టముల కోర్చి మరల సంపాదించిన దానిని,అందుననూ పూర్ణగర్భిణియగు తన భార్యను అరణ్యమునకు బంపుటకు రామునికి ఏశంకయు తోచలేదు. ఉత్తరరామచరిత్రయందలియీభాగము (నిరపరాధియైన తన్ను అరణ్యమునకు బంపుటకు ఆజ్ఞయిచ్చిన రామునిపై గినియక అతనియందే ప్రేమతో తపించుసాధ్వి సీతవంటిభూమిక) రసపోషణకు ఉత్కృష్టముగ లేదన్న చెప్పనవచ్చును.

వేణీసంహారము వీరరసప్రధానమైనది. ఇందలి భీమపాత్ర స్వభావపరిపోషణకు నిదర్శనము. స్వాభావికముగనే భీమునియందు శౌర్యము తాండవించుచుండును. "కౌరవులకు శుభమగుగాక" అన్నమాటలు విన్నంతనే అతనిశౌర్యము ద్విగుణీకృతమగును. లాక్షాగృహమున తమ్ము దహింప నెంచినది, విషాన్నము బెట్టినది, కపటజూదమాడినది, నిండుసభలో ద్రౌపదిమానభంగ మొనర్చినది, ఈయెల్లకార్యములు క్రమముగ స్మరణకు వచ్చి వానిక్రోధమును మరి యుద్ధోత్సాహమును హెచ్చొనర్చును. సహదేవునిసమాధానములు, ద్రౌపదియొక్క ఉపాలంభసంభాషణము భీమునిక్రోధమును బలపఱచును. దుర్యోధనునిభార్య భానుమతి ద్రౌపదిని పరిహాసముగా మాటలాడినదని తెలియవచ్చినంతనే అతని కోపము అనావరణమగును. క్రమముగ రసమును ఎట్లు పోషించెనో చూడుడు. మననాటకములలో స్వభావపరిపోషణ లేదనుట న్యాయమా? క్రోధ పరవశుడైన భీమునికి యెదుటనుండు గృహముగాని ఆయుధములుగాని ద్రౌపదిగాని ముందున్న ఆసనములుగాని తెలియవచ్చుట లేదు. ఈవిధమున ఉత్సాహభరితుడై భీముడు "ఈనూర్గురుకౌరవుల నేనొక్కడ చంపనా, దుశ్శాసనుని రొమ్ము పగిల్చి వానిరక్తమును త్రావనా, ఈగదచే దుర్యోధనునితల వేయివ్రక్కలు గావింపనా" అనియు "మాఅన్నగారు కౌరవులతో సంధిచేసుకొన్న చేసుకొననీ! నేనేమైనబేడినా? ఆడుదాననా? చేతులకు గాజులు తొడుగుకొంటినా? ఈకౌరవుల ధ్వంసముచేయనా!దుశ్శాసనుని చీల్పనా? దుర్యోధనుని చంప నాచేతగాదే! కౌరవులనెల్ల జంపిగాని ద్రౌపదియొక్క వెంద్రుకలను రక్తహస్తముతో ముడివేయనని" ప్రతిజ్ఞ యొనర్చి దానిని నిర్వహించును.

మఱియు కర్ణుడు అశ్వత్థామ వీరిరువురిక్రోధపూర్ణమైనఆత్మశ్లాఘము వృథాభిమానము, పౌరుషడంభము మొదలగువిషయములచే కవి ముఖ్యమగు వీరరసమును అత్యుత్తమరీతిని పోషించియున్నాడు. ఇదేవిధమున మననాటకములలో రసపోషణము, భావపోషణము యథాప్రమాణముగ తూచి రూపకముల రచించియున్నారు. భారతీయనాటకములందుకూడ స్వభావపరిపోషణము కలదనుటకై యింతవిపులముగా వ్రాయవలసివచ్చినది. శృంగారాభినయము-దానినైనను పూర్వాపరవిచారము చేయక, శిష్టాచారమును త్రోసిపుచ్చి నిమ్నప్రేక్షకుల మనోరంజనయున్న లక్ష్యమునకు తేక, అనిరీక్ష్యములైన వ్యాపారములు రంగభూమిపై చేయదొడగిన అయ్యది అశిక్షితప్రేక్షకులమనోభూమియందు నాటునుగాని, రసికప్రేక్షకులు నిందింతురు. రౌద్రరసమందు నాయకుడు కఠోరోక్తుల నాడి, ముఖమెల్ల నెఱ్ఱజేసుకొని, గ్రుడ్లురిమి, పండ్లుపటపట కొరికి, తన క్రోధభావమును చూపిన అయ్యది అరసికప్రేక్షకులకు చాలదు. చేతులు కాళ్లు నేలనుగొట్టి, అవాచ్యములగు మాటల గట్టిగా నరచి, కేకలువైచి చేతిలో నేదని ఆయుధమున్న దానితో కొట్టుట సిద్ధ్యుక్తుడైనచో అహాహాయని మెచ్చుకొందురు. శోకరసము మృదుమధురమయిన,హృదయస్పర్శియైనఅస్పష్టవిలాపములవలను,కించిత్ స్పందనముచేతను, కన్నులలో బాష్పములలోను, కంఠమును స్తంభించి మాట్లాడినప్రేక్షకులు ఆ శోకరసమును

ఆస్వాదింతురు. రొమ్ములు బాదుకొని, వెండ్రుకల విప్పుకొని, గట్టిగా అయ్యోఅయ్యోయని వెక్కి వెక్కి యేడ్చినగాని అసభ్యప్రేక్షకులు ఆశోకరసమును గ్రహింపజాలరు. ప్రేక్షకులలో రెండుతరగతుల కనుకూలముగ రచింపబడిననాటకములు మనలో కొద్దిపాటివే గలవు. ఒకభూమిక నిజస్వభావము చక్కగా తెలియుటకు, అతడు ఆత్మగతిముగ ఎట్లు నడచుకొనునదియు, అతనివిషయమున అన్యులు నిర్వికారబుద్ధితో ఎట్లు అభిప్రాయపడునదియు, అతఁడు ఏయేకార్యముల నెప్పుడెప్పుడెట్లు సాధించునదియు అనునీమూడుఅంశములు ప్రధానముగ జూడవలెనని యాధునికపాశ్చాత్యవిమర్శకు లభిప్రాయపడియున్నారు. పాశ్చాత్యదేశమందలి సాంఘికపరిస్థితి, ఆచారవిచారములు, యిక్కడికంటె భిన్నముగానున్నందున అక్కడివారియభిరుచికి ఇక్కడివారి యభిరుచికి వ్యత్యాస మున్నది. ఆధునికులలో పాశ్చాత్యశిక్ష వలన కలిగిన యీకల్పనసహా కొన్నియంశములందు మారిపోయి భిన్నములుగా నున్నవి.

కన్నడ నాటకములు స్వభావ పరిపోషణమన నేమోయెరుగవు. వాటికి యీవిషయమే అపరిచితము "ప్రభామణి విజయ" మనునాటకమున ఒకటిరెండుభూమికలు ఉత్తమమైనవి వున్నను (అవి శాంత మాళవుడు దుర్జయుడు అనునవియే) వాటికైనను స్వభావపరిపోషణము దూరముగా నున్నది. నాటక సంవిధానమందైనను అట్టి యవకాశ మొసగుటకు వీలులేదు. కృష్ణలీల, కంసవధ, మొదలగు పౌరాణిక నాటకములను ఆధునికులు రచించునప్పుడైనను స్వభావపరిపోషణ విషయము తలపెట్టకుండుట శోచనీయము. ధ్రువచరిత్రమను నాటకమును మైసూరు ప్రాంతముల సుప్రసిద్ధముగ ప్రదర్శించుచున్నారు. అందు ఉత్తమునితల్లి సురుచియను పాత్రను చిత్రించిరి. ఆమెకు సవతికుమారునిపై మిక్కిలి ద్వేష ముద్భవించునన్నది. స్వభావపరిపోషణకు తగినట్లు రచించియున్నచో రసపుష్టి చక్కగా నమరి యుండెడిది. అసలు కన్నడమున నాటకములే కొద్ది. ఉన్నవైనను సంవిధానములందు, రసపోషణయందు, స్వభావపరిపోషణమున వెనుకబడియున్నవి. భాషాంతరీకరణము లెన్నియున్నను వాఙ్మయ పీఠమందు ప్రథమస్థాన మీయబడదు.

నీరసములైనవి నూఱున్నను లాభములేదు. ఉత్కృష్టమైనవి నాలుగైదున్ననుచాలు. సంఖ్యావిషయముగాదు యోచింపదగినది. స్వతంత్రశక్తిచే నూతన సంవిధానములుగైకొని యెన్నిరచించి యున్నారనిచూచిన వేలుపెట్టి లెక్కపెట్టవచ్చును. ఇప్పుడిప్పుడు విద్యాధికులుకొందఱు మిక్కిలి శ్రద్ధతో నాటకకళోద్ధరణకై పాటుపడునట్లు కర్నాటక దేశమున గానవచ్చుచున్నది. ఆంధ్రనాటకములపైని వారి కిప్పుడిప్పుడు అభిమానము పుట్టుచున్నది. మైసూరు, బెంగుళూరు ప్రాంతములందు తెనుగునాటకము లాడుటకు ప్రయత్నములు జరుగునట్లు తెలియుచున్నది. పెద్దపెట్టుబడి పెట్టి కన్నడనాటకములాడు గొప్ప నాటక సంఘములు పెక్కు లున్నవి గాని వారు ప్రేక్షకుల కనుసరముగ హాస్యమును మిక్కుటముగ నిమిడ్చి సదభిరుచిని చెడగొట్టుచున్నారు. మనప్రాంతమందలి యొకటిరెండు గొప్ప సంఘములు కూడ నీదేపద్ధతిపై నడుపుట శోచనీయమై యున్నది. ఆధునికప్రేక్షకాభిరుచి ననుసరించి నాల్గుకాసులు సంపాదించునది మాకర్తవ్యమని కొందఱు అనుటయు, యజమానులు, నటులు అందుల కంగీకరించుటయు, నాటకకళకు అభివృద్ధిసూచకముగ లేదు. ఇప్పుడు రంగభూమిపై నాడబడునాటకముల గూర్చి రెండుమాటలు, నటులవిషయమై నాల్గు ముక్కలు చెప్పవలసియున్నది. నటులందు వేషము, అలంకారము, వీటికంటె అభినయము ఉత్తమమై యుండవలెను.

నాటకము అభినయప్రధాన మనునది లోకప్రసిద్ధమే! ముఖమునకు ఇంతరంగుపూసుకొని వస్త్రాలంకారములు ధరించి రంగముపై కెక్కి, చిలుకపాఠమువలె తన పాత్రమును చెప్పిన నటునికర్తవ్య మైనదని తలంచుట వాడుకగ తేలినది. యవనికవెనుక చెప్పుమాటల చెవియొగ్గివిని, ముందున్ననటుడు నోటిపాఠము అప్పగించునట్లు చెప్పినాల్గుపాటలను దీర్ఘముగ నీడ్చిన తానుగొప్పనటుడనని తలంచుప్రవృత్తి గానవచ్చుచున్నది. ముఖమునకు రంగుపూత, వస్త్రాలంకారము, రాగము, ఇత్యాదిబాహ్యసాధనలు లేకున్నను లేకపోవచ్చుగాక! అభినయము లేకున్న అతడు యెప్పుడు నటుడు కాజాలడు. ముఖభావము, దృష్టిక్షేపము, అంగచేష్ట, స్వరవికారము అభినయమున జేరును. నటుడు యేభూమిక నభినయించునో

దాని కనురూపమైన దృష్టిసంకోచము వికాసము స్వరమందలి హెచ్చుతగ్గులు, అభ్యాసము చేయవలెను. శోకప్రసంగమును అభినయించి చూపుటకైనను, యెల్లరు నొకేవిధముగ చేయుటకు వీలులేదు. దుఃఖము కలిగినప్పుడు పురుషు లొకవిధముగను స్త్రీలు మరొకవిధముగను అనుభవింతురు. రాజులు శ్రీమంతులు కులీనులు యెల్లరు ఒకేప్రమాణమున తమమనోవికారమును ప్రదర్శింతురనుటకు వీలులేదు. దాసదాసీత్యాదులగు తక్కువతరగతిపాత్రల మనోవ్యాపారములు, యితరులకంటె భిన్నములుగ నుండును. వీటినెల్ల నటుడు సూక్ష్మావలోకనముచే నెఱింగి, లోకమందున్న అనుభవముల చక్కగా విమర్శించి, తనకు యెందుల నెంతవఱకు అభినయమున కుపయోగించునో దానినిమాత్రము రంగస్థలముపై ప్రదర్శింపవలెను. నటుడు యేప్రసంగమును అభినయించి చూపవలయునో అద్దానితో నేకరూపత నొందవలెను. తాను రంగభూమిపై వచ్చి నటించుచున్నానన్న విషయమును ప్రేక్షకులదృష్టిలో నున్నంతకాలము మఱచి, తా నేవేషము దాల్చెనో ఆప్రాణియే తానని నటింపవలెను. తాను తానుకానునట్లు తెల్పుటకు ఆహార్యము సిద్ధపఱచుకొనవలెను. ఏకరూపత పొందిననటుడు తనభూమికచేతనే యెప్పు డెట్లు అభినయింపవలెనో అట్లే ఆప్రాణి నటింపజేయును. దీనికంతకు స్వభావపరిపోషణ పాత్రలందుండునట్లు కవి రచింపవలెను. కవిత్వమున రసపోషణ లేకున్న నటునికార్యము కష్టమే! అభినయించునప్పుడు నటుడు సదభిరుచిమీదనే దృష్టి నిల్పవలెను. నటునికంటె నాటకగ్రంథకర్తపై నిది హెచ్చుగా మోపబడును. అసభ్యమైనదానిని, అశ్లీలమైనదానిని యెచ్చటను వ్రాయరాదు; ప్రదర్శింపరాదు. ప్రేక్షకుల అభిరుచి కనుసరముగ నటులు వర్తించునది యుచితమైన కార్యము గాదు. పాత్రౌచిత్యమును గమనించి పాత్రాభినయము చేయవలయునని దీనితాత్పర్యము. ప్రజల యభిరుచిని మంచిమార్గమునకు త్రిప్పుటకు నాటకముల రచింపవలెగాని, వారి యభిరుచిని చెడుమార్గములకు ద్రిప్పి సాంఘికనీతిని చెడగొట్టుటకు నాటకముల రచింపరాదు. "నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనం" అన్నిరకముల యభిరుచిని యాస్వాదించు స్త్రీలు, విద్యార్థులు, విద్వాంసులు, కులీనులు నాటకములకు వత్తురు గాన నటుడు మిక్కిలి జాగ్రత్తతో అశ్లీలసంభాషణలగాని అసభ్యపు నటనగాని రాకుండునట్లు సర్వవిధముల గమనింపవలెను. హావభావముల అతిశయముగా చూపుటకూడ దోషమే యగును. ఇంకొక ముఖ్యవిషయము: నటుల వయస్సునుబట్టి వారి స్వాభావికచర్యల గమనించి, యుక్తాయుక్తముల పరిశీలించి వారికి తగుభూమిక నివ్వవలెగాని, యేవిచక్షణలేక యెకింతసంగీతము పాడగలవాని అతని స్వభావమునకు విరుద్ధమైన వేషముల నిచ్చి రసాభాస మొనర్పరాదు. నాటకముల నానంతవఱకు గద్యములో రచించి ఉచితమైన ఘట్టములందు కొద్దిపద్యములు పాటలు నితరభూమికలకు రంగస్థలమున ఆటంకము గల్గింపక రసపోషణమునకు వీలగునట్లు కుదుర్చుకొనవలెను. ఆధునిక నాటకగ్రంథకర్తలు నూతన స్వతంత్రరూపకముల రచించి నాట్యాదర్శముల గారవించుట శ్రేయస్కరము. పాశ్చాత్యనాటకములలో ప్రధానములగు కొన్నిటిని గైకొని వలయు మార్పు లొనరించి త్వరలో నాటకములను రచించి ఆంధ్రనాటక వాఙ్మయమునకు చేయూత నొసంగి నాటకసారస్వతాభివృద్ధికి తోడ్పడుదురు గాక !

---

# కౌశిక ధర్మవ్యాధ సంవాదము

నాదెళ్ల వెంకట్రావు గారు

'అమిత విజ్ఞాననిధివని యంపె నిపుడు
నీకడకు బ్రాహ్మణునియింటి నెలంత నన్ను
జూడఁ గులమునఁ గడజాతివాఁడవయ్యు
నెటులు కలిగెను నీకంత యెఱుక చెపుమ.
వేదశాస్త్రపురాణముల్ విసువులేక
చదివి గ్రహియించినాఁడవో సార మెల్ల?
బ్రహ్మసూత్రాలు బాగుగాఁ బఠనఁజేసి
నావొ? భాష్యత్రయంబును నలిగ నొక్కొ?